# నిర్మల నిర్ణయం

ఊరంతా అలసి సొలసి నిద్రాదేవత వడిలో ఒదిగిపోయింది. కానీ నిర్మలకి మాత్రం కంటిమీద కునుకు రావడం లేదు. మస్తిష్కం నిండా ఆలోచనలే...!

తను ఎవరికోసం బతకాలి? ఎందుకు బతకాలి?

ఇది తనని పుట్టినప్పటినుంచీ వేధిస్తున్న సమస్యే!

ఏడు సంవత్సరాలు కూడా నిండకముందే తల్లిని కోల్పోయింది. అప్పటినుంచే బరువు బాధ్యతలను మోయడం అలవాటైపోయింది. ఇంటి పన్లు, వంటపన్లతో పాటు మూడేళ్ళ చెల్లెలి ఆలనా పాలనా చూడటం కూడా తన దినచర్యలో భాగమైపోయింది.

ఉన్నట్టుండి తండ్రి ఒకావిడని ఇంటికి తీసుకొచ్చాడు. పని తగ్గుతుందని సంతోషించింది.

కానీ అప్పటినుంచీ పని ఎక్కువైంది దానితోపాటు సాధింపులు, చివాట్లు కూడా ఎక్కువైపోయాయి.

'కొత్తమ్మకి తనంటే ఎందుకంత కోపమో!' అర్థమయ్యేది కాదు. ఎంత పని చేసినా తృప్తిపడేది కాదు. తండ్రి రాగానే ఏమేమో చెప్పేది.

అంతే! దెబ్బలు... వళ్ళు వాచిపోయేది...!

చచ్చిపోవాలనే ఆలోచన మొదటగా అప్పుడే వచ్చింది తనకి. కానీ తను చనిపోతే చెల్లెలు ఆలనా పాలనా చూసేది ఎవరు? ఈ ఆలోచన చనిపోవాలనే కోరికకి కళ్ళెం వేసింది.

పదేళ్ళు కళ్ళు మూసుకుంటే పెళ్ళి సాకుతో ఈ ఇంటిని వదిలి వెళ్ళిపోవచ్చు. అప్పుడు చెల్లెల్ని కూడా తనతో తీసుకువెళ్తుంది. చక్కగా చదివిస్తుంది. తనకి తానే సమాధానపరచుకుంది. ఓదార్చుకుంది. ధైర్యం చెప్పుకుంది.

భారంగా రోజుల్ని వెళ్ళదీయసాగింది.

అదృష్టం కలిసొచ్చింది. తను అనుకున్నట్లు పది సంవత్సరాల దాకా ఆగకుండానే ఆ ఇంటిని వదిలి వెళ్ళిపోయే రోజు వచ్చింది. అంత వరకూ ఎన్ని కష్టాలనయినా భరించిందే గాని, చెల్లెలి చదువుకి ఎటువంటి ఆటంకం రానీయలేదు.

రాజారావ్ తనంతట తానే పెళ్ళి చేసుకుంటానని రావడంతో కష్టాలన్నీ గట్టెక్కిపోయాయని సంతోషపడింది. చెల్లెల్ని కూడా తనతో తీసుకొచ్చి చదివించుకుంటానని అడిగింది అతన్ని. అతను ఒప్పుకున్నాడు. తను ఆనందంతో కదిలిపోయింది.

ఖర్చులేకుండా గుండెలమీద కుంపటి తొలగిపోవడమే, చెల్లెల్ని కూడా తనతో తీసుకుపోతాననడంతో మురిసిపోయారు తల్లిదండ్రులు.

పెళ్ళి జరిగిపోయింది...

ఆ వాతావరణాన్ని ఛేదిస్తూ కుక్కలు అరవడంతో ఆలోచనలోంచి బయటికి వచ్చింది నిర్మల.

ఇటు తిరిగింది. హాయిగా నిద్రపోతున్న మనవడు. వాడికి మెలకువ వచ్చి మంచం దిగి వీధి వాకిట్లోకి వెళ్ళాడు.



'అంధకారం...తన జీవితం ఒక అంధకారం!' విరక్తిగా నవ్వుకుందామె.

అంధకారానికి, తన జీవితానికి మొదటినుంచీ అవినాభావసంబంధం వుంది.

పెళ్ళైన కొత్తల్లో ఆయన చాలా బాగా వుండేవారు. క్రమక్రమంగా మార్పు రాసాగింది. తన నీడ చూస్తేనే చిరాకు పడిపోయేవారు.

అప్పుడు తెలిసింది అసలు విషయం - అంతకుముందే ఆయనకి ఆ సంబంధముందని!

ఏ అర్ధరాత్రో, అపరాత్రో ఇంటికి వచ్చేవారు.

అంతవరకూ ఇలానే వీధిలో నిలబడి అంధకారంలో ఆయనకోసం వెదుకుతుండేది.

చెల్లెలి చదువుకి మధ్యలో ఎక్కడ అంతరాయం వస్తుందోనని కుక్కిన పేనులా అన్నీ భరించేది తను.

ఆఖరి సంవత్సరం పరీక్షలు రాసిన రోజున మరో యువకుడితో ఇంటికి వచ్చింది చెల్లెలు. ఇద్దరూ ప్రేమించుకున్నారని ఆమె చెప్తే, పెళ్ళి చేసుకుందామనుకుంటున్నామని అతను చెప్పాడు ఆనందాన్ని వ్యక్త పరుస్తూ.

ఆశీర్వదించింది తను.

అంతవరకూ ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న చెల్లెలు ప్రేమ వంకతో తనకు దూరంగా వెళ్ళిపోయింది, పెళ్ళి చేసుకుని.

తను వంటరిదైపోయింది. అప్పుడు అంధకారమే తనకి తోడుగా నిలిచిపోయింది.

కొత్తమ్మ కారణంగా తండ్రి దూరమయ్యాడు. ఈవిడెవరో కారణంతో భర్త దూరమైపోయాడు. తన కన్నీళ్ళు కరిగించలేని పాషాణం ఆయన మనసని తనకి తెలుసు. అయినా చెల్లెల్ని చూసుకుంటూ రోజుల్ని నెట్టుకొచ్చింది. ఇప్పుడు తన అవసరం తీరిపోయి చెల్లెలూ దూరంగా వెళ్ళిపోయింది. ఇంకెందుకు బ్రతకాలి? ఈ వంటరి ప్రయాణాన్ని ముగిస్తే బావుంటుంది!

ఆత్మహత్యే తన కష్టాలకి పరిష్కారమని నిశ్చయించుకున్న రోజునే తన చెవినిబడింది వార్త.

తల్లి కాబోతోంది తను!

వళ్ళు పులకరించింది.

తను వంటరిదికాదు. తన ప్రాణానికి ప్రాణంగా శరీరంలో ఓ భాగం ప్రాణం పోసుకుంటోంది! తన ప్రాణంతోపాటు వాడి ప్రాణంతీసే హక్కు తనకి లేదు.

ఆ ప్రయత్నాన్ని విరమించుకుని ప్రేమనంతా పుట్టబోయేవాడి మీదే కేంద్రీకృతం చేసుకుని రోజులు గడపసాగింది.

రాజు ఈ లోకంలోకి వచ్చాడు. వాడికి మొదటినుంచీ తండ్రిమీద కన్నా తనమీదే ఎక్కువగా అభిమానముండేది.

చదువులో వాడెప్పుడూ ఫస్టే! చదువులో వాడు చకచకా పైకిరావడంతో తనెంతో పొంగిపోయేది. ఆ ఆనందంలో ఆయన పూర్తిగా దూరమైపోయినా కూడా తను లక్ష్యపెట్టలేదు.

రాజు మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాడు. వాడికి అన్ని విధాలా సరిజోడయిన పిల్లని తేవాలని తనెంతో తహతహలాడింది. ఫలితంగా రుక్మిణి కోడలైంది.

ఏరి కోరి తెచ్చుకున్న కోడలే తన ఆశల్ని ఛిన్నాభిన్నం చేస్తుందనుకోలేదు.

మొదట్లో తనంటే అభిమానంగానే వుండేది. కానీ భర్త అభిమానంలో ఎక్కువ భాగం తల్లికే వెచ్చిస్తున్నాడనే అనుమానం ఆమెలో మార్పు తీసుకురాసాగింది. ఆ సంగతి గ్రహించీ మిన్నకుండాల్సిన పరిస్థితి అయిపోయింది తనది.

తానేం మాట్లాడినా వేరే అర్థాలు వెదకడం, నానా గోలా చేయడం ఇప్పుడామె పని!

——కొడుకు కోడలు పడుకున్న గదివేపు చూసి నిట్టూర్చింది నిర్మల.

అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది వాడి పరిస్థితి. అందుకే కాబోలు ఈ మధ్య ఇంటిని పట్టించుకోకుండా తిరగడం మొదలు పెట్టాడు.

వీడూ తండ్రిలా కాకూడదు. చక్కగా సంసారం చేసుకోవాలి. వాళ్ళ మధ్యలో తనుండకూడదు.

ఓ నిర్ణయానికొచ్చింది నిర్మల.

సరాసరి తను పడుకున్న మంచం దగ్గరకి వచ్చింది. మనవడు ఇంకా తను పక్కనే పడుకున్నదనుకుని పక్కకు తిరిగి హాయిగా నిద్ర పోతున్నాడు.

వాణ్ణి అలా చూడగానే నిర్మల మనసు చలించింది. అయినా మరు క్షణం మనసుని రాయిచేసుకుంది.

దుప్పటి మెడవరకూ కప్పి వాణ్ణి ముద్దాడింది.

గబగబా పెరటివేపు బయల్దేరింది.

మరికొద్ది క్షణాల్లో పెరట్లో వున్న బావిలో తన శవం తేలుతుంది ఈ ఇంటికి పట్టిన శని తొలగిపోతుంది.

దృఢ నిశ్చయంతో ముందుకు పడుతున్న ఆమె కాళ్ళు వెనకనుంచి మనవడి ఏడుపు వినిపించగానే ఠక్కున నిలిచి పోయాయి.

వెనక్కి తిరిగింది.

కళ్ళు నులుముకుంటూ "బామ్మా!" అని ఏడుస్తున్నాడు వాడు

తల్లిని పిడిచిపెట్టయినా వాడుండగలడుగాని తనని విడిచిపెట్టి వుండలేడు. మొదటినుంచీ తనంటే వాడికెంత ప్రేమో! తను చనిపోతే వాడు వుండగలడా?

"బామ్మా..." ఏడుపు పెరిగింది.

ఊహూఁ... తను చనిపోదు. వాడికోసమైనా బ్రతికుంటుంది చటుక్కున వెనక్కి తిరిగి పరుగున మంచం దగ్గరకి వెళ్ళి మనవణ్ణి వళ్ళోకి తీసుకుని ముద్దాడ సాగింది నిర్మల గడ్డిపోచలా అందిన మరో ఆశని మనసునిండా నింపుకుంటూ.

(ఈ వారం వారపత్రిక